సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 18 । మార్చి । 2025



గిట్టుబాటు ధర ఇవ్వాలి

కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘ సభ్యులు డైరెక్టర్‌కు అందజేశారు. 8లో ▸



దొంగ నోట్ల చలామణి?

వేలేరుపాడు మండలంలో రూ.500 నకిలీ నోట్లు చలామణి అవుతున్నట్లు తెలిసింది. సోమవారం ఓ వైన్‌షాపు వద్ద నకిలీ నోట్లు గుర్తించారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
భీమవరం	6.19	4.48
నరసాపురం	6.20	4.48
తాడేపల్లిగూడెం	6.15	4.57

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

భీమవరం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాతల జేమ్స్, సాగిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ తక్షణం ఏర్పాటుచేసి ఐఆర్ ప్రకటించాలని, డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ కార్డులపై వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోశాధికారి బీవీ రవిప్రసాద్, భీమవరం యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎస్ పాల్, పి.సీతారామరాజు పాల్గొన్నారు.

అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలి

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో భాగంగా బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. మొత్తం 11 అర్జీలు రాగా ఆయా సమస్యల పరిష్కారానికి ఫోన్‌లో అధికారులకు ఆదేశాలిచ్చారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఉన్నీషా పాల్గొన్నారు.

చేనేత కార్మికుల నిరసన

భీమవరం: చేనేత కార్మికులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చేతివృత్తుల సంఘం జిల్లా నాయకుడు ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వం రూ.135 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగింపు హామీలను నిలబెట్టుకోవాలని కోరారు.

వాట్సాప్ ద్వారా పౌర సేవలు

భీమవరం (ప్రకాశంచౌక్): మనమిత్ర వాట్సాప్ పౌర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మనమిత్ర–ప్రజల చేతిలో ప్రభుత్వం సమాచారం వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అలాగే జిల్లా క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు.

ఇన్‌చార్జి దేవదాయ శాఖ అధికారిగా సూర్యప్రకాష్



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా ఇన్‌చార్జ్ దేవదాయశాఖ అధికారిగా వి.హరి సూర్య ప్రకాష్ సోమవారం భీమవరం జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నిడదవోలు కోటసత్తెమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహక అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇన్‌చార్జి జిల్లా దేవదాయశాఖ అధికారిగా నియమించారు.

డీఎంహెచ్‌ఓగా గీతాబాయి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ జి.గీతా బాయిను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన మహేశ్వరరావు రెండు నెలల క్రితం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీఎంఓహెచ్‌గా పనిచేస్తున్న గీతాబాయిని డీఎంహెచ్‌ఓగా నియమించారు.

తెలుగును ఐచ్ఛికం చేయొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ విద్యలో సంస్కరణల్లో భాగంగా ద్వితీయ భాష తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకుల సంఘం నాయకులు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహానుకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభమైన ఇంటర్ మూల్యాంకనం సందర్భంగా వినతిపత్రాన్ని సమర్పించారు. తెలుగును ఐచ్ఛికం చేయడం వల్ల భాష మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీ రాజేష్ కుమార్, టి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇప్పటికి మూడుసార్లు..



గణపవరం మండలం ముగ్గుళ్లకి చెందిన చుక్కా గంగారత్నం కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు కాగా ఒక బిడ్డ మెదడు ఎదుగుదల లేక దివ్యాంగురాలైంది. ప్రస్తుతం ఆమెకు రూ.6 వేల పింఛన్ వస్తోంది. అయితే ఆమె ఆస్పత్రి ఖర్చులు, కుటుంబ పోషణ భారం కావడంతో గంగారత్నం తన బిడ్డకు పింఛన్ పెంచాలని కోరుతూ ఇప్పటికే మూడుసార్లు అర్జీలు ఇచ్చింది. అయినా ఆమె సమస్య పరిష్కారం కాలేదు.

సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు



మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వీరభద్రరావు అవినీతికి పాల్పడటంతో ప్రభుత్వం బదిలీ చేసింది. ఉన్నతాధికారుల విచారణలో కూడా సబ్ రిజిస్ట్రార్ తప్పు చేశారని రుజువైనా సస్పెండ్ చేయడం లేదని, వీరభద్రరావు మరలా మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా రావాలని ప్రయత్నం చేస్తున్నారని బీసీ సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు కముజు నాగ వెంకట ప్రసాద్, జిల్లా కో–ఆర్డినేటర్ వేలూరి రంగబాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరభద్రరావును సస్పెండ్ చేయాలని కోరారు.

టిడ్కో ఇళ్ల కోసం..



భీమవరానికి చెందిన కుసుమంచి పద్మావతి, లక్కోజి సుధ పేదలు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి కేవలం రూ.500తో టిడ్కో ఇళ్లు కేటాయిస్తూ పట్టాలు కూడా ఇచ్చారు. అయితే అధికారులు ఇప్పటి వరకు టిడ్కో ఫ్లాట్లు కేటాయించలేదు. దీంతో కూలీ పనులపై జీవించే తాము ఇంటి అద్దె, కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, టిడ్కో ఇళ్లు ఇస్తే సొంతింటి కల నెరవేరుతుందని, అద్దె భారం తగ్గుతుందని కలెక్టర్‌ను కలిసి వారు మొరపెట్టుకున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి అంటూ..



నరసాపురం మండలం లింగనబోయినచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో చిల్లపాలెం శ్మశాన వాటిక నుంచి గంగానమ్మ గుడి వరకు పుంత రోడ్డు పక్కన కొబ్బరి మొక్కల ఆదాయం కాజేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వాటాల రాధాకృష్ణ, జల్లి ఆశీష్‌కుమార్ కలెక్టర్‌ను కలిసి గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు మొక్కల సంరక్షణ పేరుతో ఆదాయాన్ని కాజేస్తున్నందున చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిష్కార వేదిక.. సమస్యలు తీర్చలేక!

సాక్షి ఫోకస్

- అర్జీలకు పూర్తిస్థాయిలో లభించని పరిష్కారం
- మరలా మరలా దరఖాస్తుల సమర్పణ
- వెల్లువెత్తుతున్న వినతులు



భీమవరం కలెక్టరేట్‌లో వేచి ఉన్న అర్జీదారులు



కలెక్టరేట్ వద్ద మెట్లపై కూర్చున్న బాధితులు



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ నాగరాణికి అర్జీలు అందిస్తున్న దృశ్యం

భీమవరం/ భీమవరం(ప్రకాశం చౌక్): సమస్యల పరిష్కారం కోసం భీమవరం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వస్తున్న బాధితులకు పూర్తిస్థాయిలో పరిష్కారం కానరావడం లేదు. దీంతో అర్జీదారులు మరలా మరలా అవే దరఖాస్తులు అందిస్తున్నారు. ముఖ్యంగా కొత్త పింఛన్ల మంజూరు, ఇళ్ల స్థలాలు, పింఛన్ పెంపు ఆన్‌లైన్ కోసం ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఆయా సమస్యలు పరిష్కారం కావడం లేదు. పలు గ్రామాల్లో సర్వే సక్రమంగా చేయకపోవడం, కూటమి నాయకుల పెత్తనంతో సరిహద్దు సమస్యలు తీర్చలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో గతేడాది జూన్ నుంచి ఇప్పటివరకూ 19,659 వినతులు రాగా 17,442 అర్జీలు పరిష్కరించారు. 2,217 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

కలెక్టరేట్ వద్ద పాట్లు : భీమవరంలో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారికి కలెక్టరేట్ 2 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అలాగే కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో వస్తున్న బాధితులు కూర్చోవడానికి తగిన స్థలం, కుర్చీలు లేకపోవడంతో మెట్లపై, కింద కూర్చుంటున్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. 271 మంది వినతిపత్రాలు సమర్పించారు. ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపి కలెక్టర్‌కు వినతులు సమర్పించారు.

గళమెత్తిన వైద్య సేవ సిబ్బంది



భీమవరంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యసేవ సిబ్బంది



ఆరోగ్య మిత్రలు లేకపోవడంతో ఒమేగా ఆస్పత్రిలో రోగుల పడిగాపులు

భీమవరం(ప్రకాశం చౌక్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో పని చేసే ఆరోగ్య మిత్రలు, సిబ్బంది సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ట్రస్ట్ అధికారులతో చర్చలు జరిపినా ఫలితం లేదన్నారు. దీంతో శాంతియుత నిరసనల్లో భాగంగా విధుల బహిష్కరణ, జిల్లా సమన్వయకర్త ఆఫీసుల వద్ద నిరసనలు, ఈనెల 27న ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ మంగళగిరి వద్ద నిరసనలు చేపట్టనున్నామన్నారు.

రోగుల పడిగాపులు : వైద్యసేవ సిబ్బంది విధుల బహిష్కరణతో జిల్లావ్యాప్తంగా 28 నెట్‌వర్క్ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వాస్పత్రుల వద్ద ఆరోగ్యశ్రీ సేవలు అందక రోగులు ఇబ్బంది పడ్డారు. అత్యవసర వైద్యం కోసం రూ.300 నుంచి రూ.500 వెచ్చించి ఓపీ కార్డు తీసుకుని వైద్యుడిని కలిశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నడూ ఆరోగ్యశ్రీ సేవలు ఆగలేదని, కూటమి ప్రభుత్వ తీరుతో ఇబ్బంది పడుతున్నామని పలువురు వాపోయారు. ఈనెల 24న కూడా ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది మరోమారు విధుల బహిష్కరిస్తామని ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఆ రోజూ రోగులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

ఇళ్ల సమస్యలపై నిరసన గళం



భీమవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

భీమవరం: జిల్లాలో ఇళ్లు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం భీమవరంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలుతున్న ప్రముఖులు జిల్లాలోనే ఉన్నా పేదల ఇళ్ల సమస్యలను పట్టించుకునే నాథుడే లేకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో 20 వేలకు పైగా టిడ్కో ఇళ్లలో కనీస సౌకర్యాలు లేవని మండిపడ్డారు. ప్రజల డబ్బులతో కట్టించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కల్లబొల్లి హామీలిచ్చి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన ప్రజా ప్రతినిధులు ఇప్పుడు ప్రజల్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ కాలనీలు ప్రతిపక్ష కాలనీలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ సమస్యల వలయంగా ప్రభుత్వ కాలనీలు ఉన్నాయని రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు లేవన్నారు. కనీసం చెత్త బండి, రైస్ బండి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబురావు, కోరు పెద్దిరాజు, కర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి.. లైంగిక దాడికి పాల్పడి..

- వివాహితపై ఇద్దరు వ్యక్తుల ఘాతుకం
- నగ్న వీడియోలు చూపుతూ బ్లాక్‌మెయిల్
- బాధితురాలు ఫిర్యాదు చేసినా పట్టని పోలీసులు
- ఏలూరు రేంజ్ ఐజీని కలిసిన బాధితురాలు, కుటుంబసభ్యులు



ఏలూరులో నిరసన తెలుపుతున్న బాధిత మహిళ, కుటుంబ సభ్యులు

ఏలూరు (టూటౌన్): తనను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడంతో పాటు తనను నగ్నంగా వీడియోలు తీసిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. పోలీసులను ఆశ్రయించినా కనీసం పట్టించుకోవడం లేదని, పైగా రాజీకి రావాలని, లేదంటే కౌంటర్ కేసు పెడతామని పోలీసులే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో తనకు, తన కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలంటూ ఐజీని కలిసినట్టు చెప్పింది. బాధితురాలు, ఆమె బంధువులు స్థానిక ఏటిగట్టు వద్ద ఉన్న జిల్లా రజక సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి రవి, అతని స్నేహితుడు గుబ్బల సోమేశ్వరరావు అలియాస్ సోము అనుచితంగా ప్రవర్తించారు. ఆమెను బలవంతంగా లోబర్చుకోవాలని ప్రయత్నించారు. మాట వినకపోతే ఆమె భర్తను, కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు. ఈ క్రమంలో వివాహితను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆమెకు మత్తు మందు ఇచ్చి నగ్నంగా వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేశారు. ఈ క్రమంలో బీచ్‌కు, భీమవరంలోని స్నేహితుల గదికి తీసుకువెళ్లి పలుమార్లు లైంగిక దాడికి తెగబడ్డారు. అలాగే ఆమెను బెదిరించి పలు దఫాలుగా ఆమె నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని మళ్లీ డబ్బులు కావాలంటూ వేధిస్తున్నారు.

రాజీ చేసుకోవాలని పోలీసుల ఒత్తిడి

తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోకపోగా నిందితుల పక్షాన కొమ్ము కాశారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కేసును వెనక్కి తీసుకోకపోతే తన భర్తపై, భర్త సోదరునిపై కౌంటర్ రేప్ కేసు పెడతామని, రాజీ చేసుకోవాలని పోలీసులే బెదిరిస్తున్నారని ఆమె వాపోయింది. ఈ విషయంపై పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్యతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీనిపై ఐజీ అశోక్‌కుమార్ స్పందించారని, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీని విచారణ అధికారిగా నియమించారని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కట్లయ్య తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మురళీకృష్ణ, యలమంచిలి శేషు, బుద్ధవరపు గోపి, యండమూరి వీర్రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



భీమవరంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 128 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 22,692 మందికి 22,091 మంది హాజరు కాగా 97.35 శాతం హాజరు నమోదైంది. 46 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, నాలుగు కేంద్రాలను జిల్లాస్థాయి పరిశీలకుడు, నాలుగు కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, డీఈఓ నాలుగు కేంద్రాలు, కలెక్టర్ ఒక కేంద్రంలో తనిఖీలు చేసినట్టు డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

లోటుపాట్లు లేకుండా చూడాలి

భీమవరంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం స్కూల్ కేంద్రాన్ని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు సమస్యలుంటే కంట్రోల్ రూమ్ 08816-297200కు ఫోన్ చేయాలన్నారు. డీఈఓ ఈ.నారాయణ ఆమె వెంట ఉన్నారు.

సాక్షి స్పందన



తణుకులో మట్టి గుట్టలు తొలగిస్తున్న దృశ్యం

● పారిశుద్ధ్య చర్యలు

తణుకు అర్బన్: 'రోడ్లపై తాండవిస్తున్న అపారిశుద్ధ్యం' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సజ్జాపురంలో డ్రెయినేజీల్లోంచి తీసిన పూడికను పదిరోజులైనా తొలగించడం లేదని, ఇంటి ముందు మురుగు గుట్టలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ ప్రచురితమైన కథనంపై స్పందించారు. ఉదయం మినీ జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో మురుగు గుట్టలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

● సిల్ట్ తొలగింపు

పాలకొల్లు సెంట్రల్: 'ప్రమాదకరంగా ఏఎంసీ ప్రహరీ' శీర్షికన ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి సోమవారం అధికారులు స్పందించారు. శానిటరీ వర్కర్లు ఏఎంసీ ప్రహరీ గోడకు కర్రలు అడ్డుపెట్టుకుని ప్రమాదకర పరిస్థితుల్లో సిల్ట్‌ను తొలగించారు. మార్కెట్ యార్డు ప్రధాన రహదారిలో ఉన్న సిల్ట్‌ను తొలగిస్తున్నారు. కమిషనర్ బి.విజయసారథి పర్యవేక్షిస్తున్నారు. అయితే మార్కెటింగ్ యార్డు అధికారులు మాత్రం ప్రహరీ తొలగింపునకు ప్రయత్నం చేయడం లేదు.



పాలకొల్లులో డ్రైనేజీలో సిల్ట్ తీస్తున్న దృశ్యం

క్లుప్తంగా

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

దెందులూరు: భువనేశ్వర్ వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయి. దెందులూరు మండలంలోని సీతంపేట రైల్వే ట్రాక్ సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి మూడో బోగీ చక్రాల వద్ద మంటలు వ్యాపించాయి. దీనిని గుర్తించిన రైలు సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి మంటలను ఆర్పేశారు. అనంతరం రైలు యథావిధిగా ముందుకు సాగిపోయింది. ఈ ఘటనపై రైల్వే ఎస్సై సైమన్ మాట్లాడుతూ వేసవిలో ఇలా జరగటం సర్వసాధారణమని చెప్పారు. అధిక ఎండల వల్ల బ్రేక్ షూస్‌లో స్వల్ప మరమ్మతులు వచ్చే అవకాశముందని తెలిపారు.

స్మార్ట్ గ్రిడ్‌తో నాణ్యమైన విద్యుత్

తాడేపల్లిగూడెం: స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, నష్టాలను కొంతవరకు తగ్గించవచ్చని వరంగల్ నిట్ ఆచార్యులు డాక్టర్ డి.శ్రీనివాసరావు అన్నారు. ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో పవర్ ఎలక్ట్రానిక్స్ అప్లికేషన్స్ ఇన్ స్మార్ట్‌గ్రిడ్ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ అనే అంశంపై ఐదు రోజుల పాటు జరుగనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ విద్యుత్ పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తుందన్నారు. పవర్ ఎలక్ట్రానిక్స్‌లో ఉండే వివిధ రకాల స్విచ్‌లు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఏపి నిట్ డీన్ అకడమిక్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

భీమవరం: భీమవరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారని టూటౌన్ ఎస్సై రెహమాన్ చెప్పారు. పట్టణంలోని 32వ వార్డుకు చెందిన ఎం.బేబిపవన్, భార్య లక్ష్మి, మరో వ్యక్తి మోటారు సైకిల్‌పై పెదఅమిరం వెళుతుండగా అడ్డవంతెన వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

బాలిక అదృశ్యం.

టూటౌన్ పరిధిలోని రాయలం పంచాయతీ ఉప్పుగుంటకు చెందిన బాలిక ఆదివారం తెల్లవారుజామున అదృశ్యమైనట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

ముగిసిన నాటిక పోటీలు



అనూహ్యం నాటికలో ఓ దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటిక పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజు చిగురు మేఘం, పక్కింటి మొగుడు, అనూహ్యం నాటికలు ఆకట్టుకున్నాయి. కళాపరిషత్ సభ్యులు కెవీ కృష్ణవర్మ, మానాపురం సత్యనారాయణ, మేడికొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 18 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.1,75,65,133 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తులు కానుకల రూపేణా సమర్పించిన 137 గ్రాముల బంగారం, 3.130 కేజీల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2000, రూ.1000, రూ.500 నోట్ల రూపంలో రూ.17,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ

సాయం చేసేవారు లేక..



తండ్రిని రక్త పరీక్షకు తీసుకువెళ్తూ..

ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోగుల బాధలు అన్నీ ఇన్నీ కావు. నడవలేని రోగులను సహాయకులు వీల్‌చైర్‌పై స్కానింగ్‌కు, రక్తపరీక్షకు, ఎక్స్‌రేకు, ఫిజియోథెరపీకి తీసుకువెళ్ళాల్సి ఉంటుంది. అయితే ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది ఎవరూ స్పందించరు. బోలెడన్ని పనులున్నాయ్ మీరే తీసుకువెళ్లాలంటూ చిరాకుగా సమాధానాలు చెబుతారు. చేసేదేం లేక తామే తీసుకువెళ్తున్నామని రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆసుపత్రిలో పురుష, స్త్రీ సహాయకులుగా సుమారు 35 మంది ఉండేవారని ఇప్పుడు కేవలం 12 మందికే పరిమితమయ్యారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. సోమవారం ఏలూరు జీజీహెచ్‌లో కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



నడవ లేని స్థితిలో వస్తే కనిపించని వీల్ చైర్



తమ్ముడిని ఎక్స్‌రేకు తీసుకువెళ్తున్న అన్న



ఫిజియో థెరపీకి నాన్నను తీసుకువెళ్తూ..



నడవలేని పరిస్థితిలో..

కోకోకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి

సాక్షి, అమరావతి: కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు కంపెనీలు కొనుగోలు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు, కోకో రైతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షలో కంపెనీల మాయాజాలం వలన తాము ఏవిధంగా నష్టపోతున్నామో పలువురు కోకో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏపీ కోకో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్ బాబు, గుడిబండి వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలో రూ.700కు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550–600కు మించి చెల్లించడం లేదన్నారు. గ్రేడింగ్ పేరిట అడ్డగోలుగా ధర తగ్గించడం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. వర్షాకాలపు పంట(అన్ సీజన్) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని, ఫలితంగా రైతులు వద్ద పెద్ద ఎత్తున నిల్వలు పేరుకుపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి సీజన్, అన్ సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీంను కోకో రైతులకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ కోకో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోకో రైతులు

20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20న పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కళ్యాణమండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు, ఏలూరు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కోకో రైతులను ఆహ్వానిస్తున్నామని వివరించారు.

దొంగ నోట్ల చెలామణి?

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో రూ.500 నకిలీ నోట్లు చెలామణి అవుతున్నట్లు తెలిసింది. సోమవారం వేలేరుపాడు వైన్‌షాపు వద్దకు ఓ వృద్ధురాలు మద్యం కొనుగోలుకు 2,500 తీసుకెళ్లగా, వైన్ షాపు సిబ్బంది అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, సారపాక కేంద్రాలుగా ఈ దొంగనోట్ల వ్యాపారాన్ని వేలేరుపాడు మండలంలో కొంతమంది వ్యక్తులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. శివకాశీపురానికి చెందిన ఓ వ్యక్తి బతుకుదెరువు కోసం భద్రాచలం ప్రాంతంలో ఓ పురుగుమందుల షాపులో గత కొన్నేళ్ళుగా గుమస్తాగా చేరాడు. దొంగనోట్ల ముఠాతో చేతులు కలిపిన సదరు గుమస్తా వేలేరుపాడు మండలం రేపాకగొమ్ముకు చెందిన తన బావమరిదికి దొంగనోట్లు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై నిఘా వర్గాలు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయంటున్నారు.



వేలేరుపాడు వైన్ షాపు వద్ద బయటపడ్డ నకిలీ దొంగనోట్లు ఇవే

సబ్ డీఎఫ్‌ఓపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: తన భర్తను తీవ్రంగా కొట్టి గాయపర్చిన కన్నాపురం రేంజ్ సబ్ డీఎఫ్‌ఓపై చర్యలు తీసుకోవాలని మడకం అనిత కోరింది. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనిత మాట్లాడుతూ ఈ నెల 10న తన భర్తను మాట్లాడాలని చెబుతూ అటవీశాఖాధికారులు ఫోన్ చేశారని, కన్నాపురం కార్యాలయానికి వెళ్లిన తన భర్తను తీవ్రంగా కొట్టి గాయపర్చారన్నారు. విషయం తెలుసుకున్న తాము అటవీశాఖ కార్యాలయానికి వెళ్లగా, వైద్యం తామే చేయిస్తామని, విషయం పెద్దది చేయవద్దని, చేస్తే కేసులు పెడతామని బెదిరించారని అనిత తెలిపింది. సబ్ డీఎఫ్‌వో, అతనికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కులంతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని అనిత కోరింది. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, జువ్వల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన నాయకులు

వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నామని వెంటనే బిల్లును ఆపాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్ బాబు అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ముందుగా కులగనణ జరిపి తరువాత జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో అన్ని కులాలను వర్గీకరణ చేయాలన్నారు. కేవలం మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి ఈ రెండు కులాలు కొట్టుకునేలా వర్గీకరణను తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఎప్పటికైనా మంద కృష్ణ మాదిగ వర్గీకరణ అనే అంశాన్ని పక్కనపెట్టి రాజ్యాధికారం కోసం పోరాడితే మాలలు అందరూ కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి ప్రభాకర్, నల్లి సంజీవరావు, నల్లి జయరాజు, పాలపర్తి కృపానాథ్, గాది రవి, బద్ద అంతర్వేది, మట్టా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లి రాజేష్

సినీ నటుడు నితిన్ సందడి

జంగారెడ్డిగూడెం/బుట్టాయగూడెం: సినీ హీరో నితిన్ గుర్వాయిగూడెం మద్ది క్షేత్రాన్ని దర్శించుకున్నారు. హీరో నితిన్‌తో పాటు, మైత్రీ మూవీస్ అధినేత రవిశంకర్, దర్శకుడు వెంకి కుడుముల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ముఖమండపం వద్ద అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. అనంతరం బుట్టయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ ఆలయాన్ని కూడా హీరో నితిన్ దర్శించుకున్నారు.



గుబ్బల మంగమ్మ ఆలయంలో హీరో నితిన్

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

ఏలూరు (టూటౌన్): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపిక చేసిన న్యాయవాదులకు ఐదు రోజులపాటు మధ్యవర్తిత్వంపై శిక్షణా తరగతులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా న్యాయవాదులు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకొని కక్షిదారులకు సేవ చేయాలని కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గణపవరం: గణపవరం మండలం సరిపల్లెలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు (53) అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఇంటి సమీపంలో రోడ్డు మీద నిలబడి ఉండగా కారు ఢీకొనడంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు.



కారు ఢీకొని మృతి చెందిన నాగేశ్వరరావు

క్లుప్తంగా

అభయ గణపతికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫాల్గుణ బహుళ చవితి పురస్కరించుకొని సోమవారం రాత్రి స్థానిక రామచంద్రరావుపేటలో అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు, వ్రతాలు జరిగాయి. స్వామి వారికి దుర్వాంకురాలు, శ్వేతార్క పుష్పాలతో అర్చనలు జరిగాయి. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళ్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలో భవిత దివ్యాంగుల పాఠశాల ఆవరణలో సోమవారం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు వక్తలు పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, భవిత ఉపాధ్యాయులు ఎం.చంద్రకుమారి, బాల ఈశ్వరయ్య, రత్నకుమారి, శ్రీదేవి, అనిల్, పవన్, పోతురాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


అత్తిలి తహసీల్దార్ దశికవంశీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం అత్తిలి తహసీల్దార్ దశికవంశీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పమ్మి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. గత పీఆర్సీలో తగ్గించిన అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆరోగ్యకార్డులపై ఆసుపత్రుల వారు చికిత్స చేయడంలేదన్నారు. దీనివల్ల పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగదు రహిత చికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని ఏబీఈఈఏ నేషనల్ కౌన్సిల్ సభ్యులు టీవీ సూర్యనారాయణ హెచ్చరించారు. ఎస్‌బీఐ మార్కెట్ యార్డ్ శాఖ ఏర్పాటు చేసిన యూఎఫ్‌బీయూచే సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు యూనియన్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని, బ్యాంకుల్లో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, లేడీస్ స్టాఫ్‌కు రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లుతో బ్యాంక్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను ఐబీఏ, ప్రభుత్వాలు ఆయా సమస్యల పరిష్కారం ద్వారా నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారుల సంఘం జోనల్ కార్యదర్శి జి.జవహర్‌లాల్, యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఎస్.ఎస్.ప్రసాద్, యూనియన్ నాయకులు ఎం.కిరణ్, బి.ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ, కనకారావు, ప్రకాష్ కుమార్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: మహిళల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (సీబీఐ విజయవాడ) పోలిశెట్టి శోభన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ మహిళా సాధికారత, ఆర్థిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మహిళల హక్కులు, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

పారిశుద్ధ్య కార్మికులపై కూటమి వివక్ష

- వేతనాల్లేక అల్లాడుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- 5 నెలల బకాయిలకు 2 నెలల వేతనాలిస్తే ఎలా
- అప్పులు చేసి రోజులు గడుపుతున్నామంటూ వేదనలు
- తిరిగి సమ్మెలోకి వెళ్తామంటున్న వైనం


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద సమ్మెకు దిగిన పారిశుద్ధ్య కార్మికులు, యూనియన్ నాయకులు భీమారావు (ఫైల్)


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డీసీహెచ్ఎస్ సూర్యనారాయణకు వినతి అందజేస్తున్న కార్మికులు, నాయకులు భీమారావు. (ఫైల్)


జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులపట్ల కూటమి ప్రభుత్వ తీరు వివాదాస్పదంగా మారింది. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరుతో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చేసి వారితో ఫొటో సెషన్‌లో పాల్గొన్న చంద్రబాబు ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 5నెలలపాటు వేతనాలు ఇవ్వకపోవడంతో ఈనెల 4వ తేదీ నుంచి విధుల బహిష్కరణకు పిలుపునిచ్చి సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. సమ్మెకు దిగిన వెంటనే వైద్యశాఖ అధికారుల చొరవతో పారిశుద్ధ్య కార్మికులు ఒక్క రోజుతోనే సమ్మె విరమించి మళ్లీ విధుల్లోకి వచ్చారు. ఈనెల 10వ తేదీ లోపుగా వేతనాలు జమ అవుతాయని డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ ఇచ్చిన మాటకు కట్టుబడి పారిశుద్ధ్య కార్మికులు విధుల్లోకి వెళ్లారు. 5 నెలలకు సంబంధించి వేతనాలు వేయాల్సి ఉండగా ఈనెల 13వ తేదీన కేవలం రెండు నెలలకు మాత్రమే వేతనాలు వేయడం మళ్లీ వివాదాస్పదంగా మారింది. ఇదెక్కడి చోద్యమంటూ మా కష్టానికి సంబంధించిన వేతనాలివ్వడానికి ప్రభుత్వం ఇంతగా ఇబ్బందులు పడుతుందేంటంటూ కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు.

అప్పుల పాలవుతున్నామంటూ కార్మికుల వేదన

వేతనాల బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో ఇళ్లు గడిపేందుకు అప్పులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందంటూ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యసేవలకు సంబంధించి ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో వచ్చే వ్యర్థాలతో పాటు వివిధ వార్డుల్లో వచ్చే వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా పనిచేస్తుంటారు. రక్తపు వ్యర్థాల తొలగింపులో రోగాలబారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లోనే విధుల్లో ఉండాల్సి వస్తుందని అయినప్పటికీ ఏ నెల వేతనం ఆనెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులను మెచ్చుకుంటూ మాపై కూటమి ప్రభుత్వం ఎందుకు వివక్ష చూపిస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంత దారుణంగా ఎప్పుడు వేతన బకాయిలు లేవని ఇప్పుడు ఎందుకిలా మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ వాపోతున్నారు.

తిరిగి సమ్మెలోకి వెళ్తాం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ వేతనానికి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ వేతనం కూడా ఏ నెల వేతనం ఆ నెలలో ఇవ్వకుండా 5 నెలలపాటు బకాయిలు పేరుకుపోగా ఈనెల 4న సమ్మెకు దిగాం. ఈనెల 13న కేవలం 2నెలల వేతనం మాత్రమే జమ చేయడం ఎంతవరకు సబబు. తక్షణమే పూర్తి బకాయిలు చెల్లింపులు చేయకపోతే తిరిగి సమ్మె బాటపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కోనాల భీమారావు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు

2న మండల సర్వసభ్య సమావేశం

పెంటపాడు: వచ్చే నెల 2న పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షన జరిగే ఈ సమావేశంలో అన్నిశాఖల అధికారులు తప్పక పాల్గొవాలని ఆయన కోరారు.

22న అత్తిలిలో..

అత్తిలి: ఈనెల 22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రొక్కాల నాగ బుజ్జి కోరారు. ఏప్రిల్ 1వ తేదీన నుంచి శిక్షణ తరగుతులు ప్రారంభంఅవుతాయని, స్పోకెన్ ఇంగ్లీషు కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్ అందజేస్తామని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 63056 83467ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా గౌరీదేవి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ


మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

పెంటపాడు: మండలంలో నూతనంగా నిర్మించిన గౌరీదేవి అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ, ధ్వజ, శిఖరప్రతిష్ఠ, ఆంజనేయస్వామివారి ప్రతిష్ఠలు సోమవారంతో ముగిసాయి. ముగింపు రోజైన సోమవారం భారీసంఖ్యలో హాజరైన ప్రజల సమక్షంలో ప్రత్యేక వేదమంత్రోఛ్ఛారణలతో విగ్రహప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి హాజరైన 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, వెలమసంక్షేమ సంఘం, గౌరీదేవి అమ్మవారి అభివృద్ధి సంక్షేమ సంఘం సమక్షంలో ఈ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గౌరీదేవి అమ్మవారిని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగనన్న హయాంలో దేవాదాయ శాఖామంత్రిగా తాను ఆలయాలు అభివృద్ధి చేయడంతో పాటు దూప, దీప నైవేధ్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దేవాదాయ నిధులైన రూ. 1 కోటితో పాటు, దాతల ద్వారా సేకరించిన సొమ్ముతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన వెలమ సంక్షేమ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమసంఘ సభ్యులైన దాసరి అప్పన్న, కిలపర్తి వెంకటరావు, జామి కృష్ణ, నక్కా సాంబశివ, సలుమూరి ప్రకాష్, బండారు నాగు తదితరులు గజమాలతో కొట్టు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీపీ దాసరి హైమావతి, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, తో పాటు, వలవల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత పాటించి కీటకజనిత వ్యాధులను అరికడదామని, ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు వీకర్స్‌కాలనీ, బేబి సెంటర్ జంక్షన్ పరిధిలోని 1, 6, 8 వార్డుల్లో సోమవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, క్షేత్ర స్థాయి పరిశీలనలు, ర్యాలీలు, ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో వార్డు ఆరోగ్య, పోషణ అభివృద్ధి కమిటీల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమల నిర్మూలించేందుకు కృషి చేయడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలని తదితర విషయాలను చర్చించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పద్మ, కార్యకర్తలు మల్లిక, మేరీ, వెంకట లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది భవాని, దురగ సుజాత, కోమలి, సహాయకులు ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు 7 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. భర్త చనిపోవడంతో వృద్ధాప్య ఫించన్‌ను తనకు మంజూరు చేయాలని, బందులదొడ్డిని బాగుచేయించి రోడ్లపై తిరుగుతున్న పశువుల్ని అక్కడ ఉంచాలని, సాలిపేటలో ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోవాలని, పెదపేటలో శిథిలావస్థలో ఉన్న రామాలయం బాగుచేయించి, భక్తులు దేవాలయానికి వచ్చేలా సౌకర్యం కల్పించాలని తదితర ఫిర్యాదు చేశారు.

పాడి పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న సర్పంచ్ బుచ్చిబాబు, ఏడీ అనిల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు అన్నారు. సోమవారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రతీ రైతు తమ పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం 200 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 40 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేశారు. అలాగే పాడి పశువులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు టి.విజయ్‌కుమార్, క్రాంతి కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ జె.సతీష్, ఏహెచ్ఏలు దేవిక, దుర్గ, సుజీవనరావు పాల్గొన్నారు.

ఆకస్మిక సందర్శన

పెంటపాడు: చెత్త, చెదారంగా ఉన్న పెంటపాడు మండల కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలని ఎంపీడీవో బాలాజీకి జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ హితవు పలికారు. సోమవారం ఆమె పెంటపాడు మండల కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జెడ్పీ చైర్మన్ అయ్యాక ఆమె తొలిసారిగా పెంటపాడు మండల కార్యాలయం విచ్చేసారు. ఈసందర్భంగా చెత్త చెదారంతో నిండిన కార్యాలయాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల హాజరుశాతాన్ని, పలు రికార్డులను పరిశీలించారు. కాగా ఆహ్లాదకరంగా ఉండాల్సిన మండల కార్యాలయం చెత్తతో లేకుండా చూసుకొని పలు గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని తెలిపారు. మండల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి


కృష్ణాయపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను తప్పకుండా పాటించాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని పటిష్టం చేయాలన్నారు. పార్టీ ఆదేశానుసారం గ్రామ గ్రామాన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణాయపాలెం గ్రామ కమిటీని నియమించారు. నియోజకవర్గ సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ కనుపూరి ఉదయభాస్కర్, కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, సిర్రావు శాంతకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శలు


తణుకులో పాండురంగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం పులువురు పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. తణుకు స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము) ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కారణంగా ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. కారుమూరి వ్యక్తిగత సహాయకుడు ధనరాజు అల్లుడు భానుప్రకాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందర్భంగా వారి నివాసానికి వెళ్లి మాట్లాడారు. పార్టీ నాయకులు సత్తి పాండురంగారెడ్డి తల్లి ఇటీవల మరణించిన సందర్భంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. తణుకు పట్టణానికి చెందిన గిరిరెడ్డి తల్లి ఇటీవల స్వర్గస్తులైన కారణంగా వారిని, తణుకు ఎన్జీవో కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త సుమల సాయి తల్లి ఇటీవల మరణించిన కారణంగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, నాయకులు వి.సీతారాం, జల్లూరి జగదీష్, కొమ్మోజు రామకృష్ణ, వై.రామకృష్ణ, సాక్షి గోపాలరావు, డీజే అమూల్యారావు, బెజ్జవరపు హేమశ్రీ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగమైందని వెంటనే విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కొంతమంది ఫిర్యాదు చేశారు. మోగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సుజాత 2021–22 సంవత్సరానికి పంచాయతీ నిధుల నుంచి వర్క్ నిమిత్తం రూ.27,45,609, ఖర్చుల నిమిత్తం రూ.14,03,953 కలిపి మొత్తం రూ.41,49,562 తన సొంత ఖాతాకు జమ చేసుకుని స్వాహా చేశారని సోమవారం గ్రామానికి చెందిన జాలే సునీత, కోనాల ప్రకాష్, ఐదో వార్డ్ మెంబర్ పి.వెంకటరాజు, పి.వెంకటరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ట్యాంక్ వాచర్‌గా పనిచేస్తున్న గంగరాజుకు ఇవ్వాల్సిన బిల్లు అతనికి సొంత అకౌంట్‌కి కాకుండా సుజాత తన అకౌంట్ కు వేసుకుందని, పలు వర్కులకు అంచనా విలువ ముందుగా బోర్డు సభ్యులకు తెలియజేయకుండా కార్యదర్శి ఖాతాలో జమ చేసుకున్నట్లు ఆరోపించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం


తణుకు అర్బన్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి, కొమ్ముగూడెం, ఆరుగొలను, మాధవరం గ్రామాల్లోని పది పరీక్షా కేంద్రాల్లో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్ష కావడంతో ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నెంబర్లు ఆధారంగా రూమ్‌లను చూసుకునే పనిలో విద్యార్థులు నిమగ్నమయ్యారు. ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతినిచ్చారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో పరీక్షించిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి సిబ్బంది పంపించారు. మాధవరం జెడ్పీహెచ్‌లో 245మందికి గాను 240మంది, ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌జేసీ (గురుకులం)లో 169మందికి గాను 164మంది, కొమ్ముగూడెం జెడ్పీహెచ్‌లో 169మందికి గాను 164మంది, పెదతాడేపల్లి జెడ్పీహెచ్‌లో 180మందికి గాను 177మంది విద్యార్థులు హాజరయ్యారు. 18మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో వి.హనుమ తెలిపారు. కొమ్ముగూడెం జెడ్పీహెచ్ సెంటర్‌ను స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

తాడేపల్లిగూడెంలో...

తాడేపల్లిగూడెం (టీఓసీ): పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో 8 సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడవెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్ జోన్స్ సెంటర్‌లలో పరీక్షలు జరిగాయి. ఉదయం 8.00 గంటల నుంచే విద్యార్థినీచ విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. సెంటర్‌లు వద్ద ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను పరిశీలించి హాల్ టిక్కెట్లును సరిచూసుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులను ఉపాధ్యాయులు తనిఖీలు చేసి పరీక్ష రూంలకు పంపారు. దివ్యాంగులు విద్యార్థులు సైతం తల్లిదండ్రుల సహాయంతో సెంటర్‌లకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. మొత్తం విద్యార్థులు 1,782 మంది కాగా 1744 మంది పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు.

పది పరీక్షలు ప్రారంభం

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తణుకు మునిసిపాలిటీ, తణుకు మండలానికి సంబంధించి 12 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొదటిరోజున విద్యార్థులు ముందుగానే ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. తమ హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకుని కేంద్రాల్లోకి వెళ్లారు. పరీక్షలకు 2,573 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరుతో 2,551 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అత్తిలి మండలంలో...

అత్తిలి: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అత్తిలి మండలంలో ఆరవల్లి, అత్తిలి, బల్లిపాడు, కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు హాజరై పరీక్షలు రాసారు. నిర్ణీత సమయాని కంటే ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పరీక్షకు 552 మంది విద్యార్థులకు గాను 548 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో ఎస్ రమేష్ తెలిపారు.


తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హాల్‌టిక్కెట్ నెంబర్లను పరిశీలించుకుంటున్న విద్యార్థులు


తాడేపల్లిగూడెం(టీఓసీ): పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు


అత్తిలి: బల్లిపాడు పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

జ్ఞాన సరస్వతి హోమం

భీమవరం(ప్రకాశంచౌక్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని జ్ఞాన సరస్వతి హోమం నిర్వహించారు. సోమవారం భీమవరం మెంటేవారి తోటలోని విజయ గణపతి ఆలయంలో ఆలయ అభివృద్ధి ఆధ్వర్యంలో గొల్లవెల్లి శ్యామ్ వెంకట త్రియాష్, భక్తులు స్కూల్ విద్యార్థులతో జ్ఞాన సరస్వతి హోమం, మేధా శక్తి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.